
# నారుపోసినవాడే....

పులికంటి కృష్ణారెడ్డి



అక్కడ ఆతన్ని ఆ స్థితిలో చూస్తానని నేను కలలో గూడా వూహించలేదు.

ఆతణ్ణే నేను చూశాను. అత డవునా కాదా?— అని కాసేపు నిదానించి చూడవలసి వచ్చింది.

అవును మరి!—కూర్చున్న చోటికే వడ్డించిన విస్తరి వస్తూంటే కడపదాటి కాలు పెట్ట నవసరం లేకుండా నవారు మంచం మీద రాజాలా కూర్చుని తాజా కబుర్లతో కాలక్షేపం చేసే మనిషి ఇక్కడ ఈ రూపంలో సాక్షాత్కరిస్తాడని నేను పొరబాటుగానైనా అనుకోవడానికి ఆస్కారం లేదు.

ఈ మూసి గూడులా తయారయింది. గడ్డం బాగా పెరిగింది. కండ్లు గుంతలు పడ్డాయి. మిగిలిన బట్టలు సగం శరీరాన్ని కూడా సంరక్షించలేక సతమతమవుతున్నాయి. . . నిజంగా అతడేనా? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ప్రశ్నించు [illegible]

ఆ కొన్ని క్షణాల్లో ఒక క్షణం అతను నన్ను గమనించాడు.

అంతే! తప్పు చేసినవాడిలా తలవంచుకున్నాడు. దొంగతనం చేసినవాడిలా దొరికిపోతానేమో?— అన్న భయంతో అక్కడి నుండి జారుకున్నాడు.

ఎప్పుడు లేచినా రాళ్ళ కాలువ దగ్గర తెల్లారి నట్లే. ఎంత తొందరగా లేచినా ఈ పని వేళల మార్పుతో హోటల్ సందర్శనం తప్పని సరిఅవుతున్నది. సుష్టుగా తిని హోటలు యజమానికి బిల్లు చెల్లిస్తూ నే నతన్ని చూశాను. ఆ హోటల్ ముందు నిలబడి 'దేహీ' అని చేయి చాస్తూ అతడు నన్ను గమనించాడు.

అతడు నిలబడిన చోటికి నేను వచ్చేసరికి అతడా ప్రక్కన సందులో దూరాడు. నేనా సందు మలుపును సమీపించేలోగా అతడు కనబడకుండా పోయాడు.

[illegible]

నా కర్తవ్యం కూడా! అయితే ఆ సందుగొందులతో నా హోదా రాజీ పడలేదు.

ఆఫీసు దారి పట్టాను. దారి మీద నడుస్తున్నా నన్న మాటేగానీ, మనస్సంతా అతని ఆలోచనలతోనే నిండి పోయింది. ఆఫీసులో కూర్చున్నాను కూర్చున్నా నన్న మాటే గానీ,పని చేయడానికే బుద్ధి పుట్టలేదు బుద్ధి అక్కడ ఉంటేకదా పని చేయడానికి. ఆదెప్పుడో బండెక్కింది. నేను చదువుకున్న పూర్లో దిగింది.

అప్పుడు—అంటే ఒక పది పన్నెండేళ్ళ క్రిందట నేను ఒక విద్యార్థిని. కళాశాల విద్యార్థిని. ఆ రోజుల్లో కళాశాలల్లోనయినా సులభంగా చేరవచ్చును గానీ, హాస్టలు వసతి సంపాదించడమంటే భగీరథ ప్రయత్నం. అందువల్ల విద్యార్థులందరూ పూరి మీద పడేవాళ్ళు. సందుగొందులు తిరిగేవాళ్ళు. కడప కడప ఎక్కి ఆడిగేవాళ్ళు. ఒక చిన్న గది కోసం లగుడిన వాళ్ళందర్నీ అడిగేవాళ్ళు. ఇంటి యజమానులు కూడా తక్కువ తిన్నవాళ్ళేం కాదు. అద్దెకు గదులంటూ ఉంటే ఒకటికి పదిసార్లు తిప్పించుకునే వాళ్ళు. ఈ పదిసార్లు తిరగడములో కుర్రవాడి వినయ విధేయతకే మాట తీరు గమనించేవాళ్ళు. వాళ్ళకు నచ్చితే గది ఇచ్చే వాళ్ళు. లేదంటే బ్రహ్మ రుద్రులు దిగి వచ్చి అవునన్నా కాదనేవాళ్ళు. ఇక ఆడపిల్లలున్న ఇండ్లయితే—పరీక్షలకు తట్టుకుని నిలబడడం సామాన్యమైన విషయం కాదు. అలా అద్దె గది కోసం తిరిగిన వాళ్ళల్లో నేనూ ఒకణ్ణే! అయితే ఒకటికి పదిసార్లు తిప్పించుకోకుండా అడుగుతూనే ఎగాదిగా చూచి ఏమీ మాట్లాడకుండా తాళాలు చేతి కిచ్చిన మంచి మనిషి మాధవయ్య

సాక్షాత్తు ఆ మాధవయ్యగారే ఈనాడు హోటలు ముందు సాక్షాత్కరించింది!

వోడలు బండ్లు కావడము, బండ్లు ఓడలు కావడము, అదృష్టము, దురదృష్టము, ఇలాంటి— ఇలాంటి మాటలన్నీ మనిషి నిస్సహాయస్థితిలో పూరటచెందడానికి సృష్టించుకున్న దానికి మాత్రమే వాడిని. అయితే అనాటి మాధవయ్యను ఈనాటి మాధవయ్యతో పోల్చి చూసుకుంటుంటే నా భావన తారుమారవుతూ ఉంది. దేవుడనే వాడుంటే పరీక్షలు పెట్టడమేనా వాడి పని! పరీక్షలకు తట్టుకోలేక గిలగిల కొట్టుకుంటుంటే చూస్తూ నవ్వుకోవటం వాడి కానందమా!

మనస్సు పరిపరివిధాల పోతూ ఉంది.

అనాటి మాధవయ్య అంటే ఇంటి యజమాని ఆ పట్టణంలో గృహపతి ఉన్న మనిషి. పొలాన్ని కౌలుకిచ్చాడు. తిండిగింజలకు సరిపోతుంది. ఉన్న ఇంట్లో రెండు గదుల్లో తాను కాపురముంటూ మిగిలిన గదుల్ని బాడుగలకు ఇచ్చాడు. దాంతో పై ఖర్చులు కొట్టుకుపోతాయి. ఇంటి ముందు ఒక వసారా మంచం మీద దర్జాగా కూర్చుని కబుర్లతో కాలక్షేపం చేసేవాడు. ఎప్పుడయినా కాస్త తీరుబడిగా అతనితో మాట్లాడుతున్నప్పుడు "ఏమండీ? ఇలా గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోవటానికి పోతే ఏదైనా ఏజెన్సీ లేదా ఒక వ్యాపారం చేయవచ్చు గదండీ!" అని పొరపాటుగా నోరు జారితే ఆయన గలగల నవ్వేసేవాడు. ఎందుకా విధంగా నవ్వుతున్నాడో అర్థం కాకుండా అతని వైపు చూస్తుంటే ఆయన అనే వాడు.

"చూడు బాబు! పూట కూటికోసం కోటి వేషాలు వేసేవాడైనా, కోట్లు సంపాదించేవాడైనా ఒకనాటి మట్టిలో కలిసి పోవల్సిందే కదా? వచ్చేటప్పుడేమి తెచ్చుకున్నామయ్యా పోయ్యేటప్పుడు మోసుకుని పోవడానికి! ఏదో దేవుడు ఇచ్చాడు. ఇచ్చిన దాంతో సరిపెట్టుకోలేక అల్లాడి పోర్లాడి ఆఖరికి నెత్తిన బెట్టుకుని పోయేదేముంది నాయనా! అందుకే ఉన్న దాంతో తృప్తి పడడం నేర్చుకోవాలి మనిషన్నవాడు!

"మీరొక్కరయితే ఫరవాలేదండీ! పిల్లలున్నారు గదా? అందులో ఆడ పిల్లలు. వాళ్ళ చదువు సంధ్యలు. . . పెళ్ళిళ్ళు. . . ఎన్ని బాధ్యతలు? ఆ బాధ్యతలన్నీ తీర్చాలి కదండీ?" ఆ వయస్సుకే ఏదో బాధ్యతల్ని నెత్తిన మోస్తున్న వాడిలాగా మాట్లాడేవాడిని.

నోటి నిండుకు నవ్వేవా డాయన!

అతని తీరు, నా నోరు చిత్రంగా ఉండేవి. అదో విధంగా అతనివైపు చూస్తూ ఉండిపోయేవాడిని.

"మా తల్లితండ్రులకు మేము పదిమందిమి నాయనా! అయిదు మంది ఆడవాళ్ళు. అయిదు మంది మగవాళ్ళు. అందరూ వాళ్ళ బ్రతుకులు వాళ్ళు హాయిగానే బ్రతుకుతున్నారు. మనం బ్రతకడం బ్రతక లేకపోవడం అనేది ఈ జన్మ ప్రయత్నం కాదు బాబూ! అది జన్మజన్మల ఫలితం. . ."

అతిని ధోరణి నాకు విడ్డూరంగా కనిపించేది.

"అందరూ మీలాగే ఆలోచిస్తే ఇక లోకం గతేం కావాలండీ!"

ఆయన అరచేతిని విప్పి చూపిస్తూ, ఆ వ్రేళ్ళ వైపు చూస్తూ గలగల నవ్వేవాడు. అంటే— అన్ని వ్రేళ్ళు సమంగా లేవని ఆయన భావం కాబోలు!

ఆ విధంగా నిమ్మకు నీరెత్తినట్లు నిమ్మళంగా కూర్చున్న మనిషి ఈ రోజు హోటలు ముందు చేయి చాస్తూ కనుపించాడు. ఒకనాడు చేయి చూశాడు. వ్రేళ్ళవంక చూస్తూ నవ్వాడు. ఈ రోజు వ్రేళ్ళ వంక చూస్తూ చేయి చాశాడు. అయితే నాటికీ నేటికీ ఎంత తేడా ?


తలుచుకున్న కొద్దీ కడుపులో దేవినట్లవుతూ ఉంది.

మాధవయ్య కల్లా కపటం ఎరగని మంచి మనిషి! వేళ కంత తినడం. . . తీరిగ్గా కూర్చోవడం. తోచక పోతే ఏ రామాయణమో భారతమో ముందుంచుకుని కూనిరాగాలు తీయడం అతని నిత్య కృత్యం. నేనంటే అతనికి వల్లమాలిన అభిమానం. ఒకరి మాటకు చేతకు పోకుండా నా గదిలో నేను కూర్చుని పుస్తకాల పురుగ్గా ఉండడం ఆయనకు బాగా నచ్చింది. అందుకే పండుగ పబ్బాలకు నేను మా ఊరికి వెళ్ళకపోతే కడప దాటి కదలనిచ్చేవాడు కాదు. ప్రక్కన కూర్చో బెట్టుకుని అడిగి అడిగి వడ్డించి కడుపు నిండా తినబెట్టేవాడు.

ఇక ఎప్పుడయినా కాస్త తీరుబడి చిక్కి వసారా మంచం మీద ప్రక్కన కూర్చుంటే అతని కర్మ సిద్ధాంతంతో అరికాలి మంట ఉచ్చికెక్కేది. ఆయన మీద విరుచుకు పడ్డట్టు వాగేవాడిని. అయినా ఆయన అలవోకగా నవ్వుకునే వాడు—పిల్ల కాకి కేం తెలుసులే ఉండేలు దెబ్బ అన్నట్లు!

'అలాంటి మంచి మనిషిని వెదికిపట్టుకుని ఉంటే బాగుండేది. మనసారా కాసేపు మాట్లాడుకుని ఉండవచ్చు. అతనితో మాట్లాడి ఉంటే అసలు సంగతి తెలిసేది. మనసు కాస్త నెమ్మదించేది. కనీసం ఒక పూట ఆయనతో కలిసి తిని, ఒక జత బట్టలు కొని ఇచ్చి ఉంటే ఏదో ఉడతా భక్తి ఋణ విముక్తుడినయ్యానన్న తృప్తి మిగిలేది. ఎంత పొరపాటయింది? ఈ హోదాలు గీదాలన్నిటినీ మడిచి మూటగట్టి పారేసి ఆ సందు గొందుల వెంబడి వెదకవలసింది!" అని మనస్సు ఆరాట పడుతూ ఉంది. అతని ప్రస్తుత పరిస్థితికి కారణ మేమయి ఉంటుందో ఆరా తీయడానికి ఆయత్త మవుతూ ఉంది.

చదువుకునే రోజుల్లో ఒక రోజు నేను ఇంటికి



ఆలస్యంగా వచ్చాను. నన్ను చూస్తూనే ఇంటి ముందు వసారా పంచం మీద పడుకుని ఉన్న మాధవయ్యగారు లేచి కూర్చున్నారు. అనుకోని రీతిగా ఆయన లేచి కూర్చునేసరికి నే నాయన ముందు నిలబడ్డాను!

"ఏం నాయనా, ఇంత ఆలస్యంగా వస్తున్నావ్?" అడిగాడు మాధవయ్య.

"అన్నమాచార్య కళామందిరంలో ఒక కార్యక్రమం ఉండిందండీ! అది ప్రభుత్వం వాళ్ళు ఏర్పాటు చేశారు. చూచి వస్తున్నా!"

"ఏం కార్యక్రమమయ్యా?"

"బుర్ర కథ చెప్పారండీ! ఎంత బాగా చెప్పారను కున్నారు!"

"అరె! నాకు తెలియక పోయిందే! మాట మాత్రం నాతో అనరాదూ! నేనూ వచ్చేవాడిని గదయ్యా!"

"మీరు వింటే మండి పడతారు. అందుకని మీతో అనలేదు."

"ఎందుకని?"

"అది కుటుంబ సంక్షేమానికి సంబంధించిన బుర్ర కథ కాబట్టి!"

గలగల నవ్వా రాయన—నిద్ర పోతున్నవాళ్ళు మేల్కొంటారా అన్నట్లు.

నవ్వు నాలుగు విధాల చేటంటారు. కానీ ఆయన మాత్రం ఆరోగ్య ప్రద మనుకున్నట్లుంది. అయిన దానికి, కానిదానికి హాయిగా నవ్వడానికి అలవాటు పడి పోయారు. ఆదే నేను ఆలోచిస్తూంటే ఆయన అన్నారు:

"చూడు, బాబూ! ఎంత నాగరికత ముదిరితే కూడా భ్రూణ హత్యలకు పాల్పడడమా? ఇంతకన్నా నేరం మరొకటుందా? కోపతాపాలకో, అసూయా ద్వేషాలకో లోబడి ఒక్క హత్య చేస్తే ఉరిశిక్ష విధిస్తున్నారే! మరి ఇన్ని హత్యలు చేస్తున్న వాళ్ళకు ఏ శిక్ష విధించాలి? పోనీ, ఇన్ని చేస్తున్నా మంటున్నారే! గొడ్రాలికి బిడ్డను పుట్టించమనండి చూద్దాం!"

ఈసారి నేను నవ్వాను అతని అమాయకత్వానికి.

"ఎందుకు, నాయనా, అలా నవ్వుతావు?"

"చూడండి. దేశంలో జనాభా విపరీతంగా పెరిగి పోవు ది. ఇది ఇలానే కొనసాగితే ఒక నాటికి ఈ దేశంలో మనిషి నిలబడడానికి కూడా చోటుండదు. అదీగాక గంపెడు సంతానాన్ని కనడం . . . ఆకలి అజ్ఞానం లేకుండా వాళ్ళను గాలికి వదలడం కాకుండా ఒకరిద్దరితో తృప్తిపడి వాళ్ళకు మంచి భవిష్యత్తు కల్పిస్తే మనల్ని మనం బాగు చేసుకొన్న వాళ్ళమే కాకుండా దేశ భవిష్యత్తుకు తోడ్పడిన వాళ్ళవుతాం! ఏమంటారు?" బుర్ర కథలో విన్న మాటల్నే ఆయనతో అన్నాను.

"అది మీ పిచ్చి అంటాను బాబూ! ఎందుకంటే నారు పోసిన వాడు నీరు పొయ్యకుండా పోడు. అల్లాను కుంటే అడవి పక్షుల కాహారం ఎవరేస్తున్నారు? మృగాలకు మే తెవడు పెడు తున్నాడు? . . నోరు లేని జంతువులే బతుకుతుంటే మనుషులేనా బతక లేకుండా పొయ్యేది?"

★

ప్రతివ్యక్తి తన అదృష్టానికి తను కర్త కాడు. కానీ తనవ్యక్తిత్వానికి, తనే కర్త కాగలడు.

— బ్రాడ్‌మన్

★

"అక్కడే మీరు పొరపాటు పడుతున్నారు. ఉదాహరణకి మీ కుటుంబాన్నే తీసుకోండి. అమ్మగారేమో ఏటా బాలెంత రాలాయె! అందులో వరసగా ఆడ పిల్లలు. ఈ కాలంలో ఆడపిల్లల పెండ్లిండ్లు చేయడమంటే మాటలా?"

ఈసారి ఒక వేదాంతిరా నవ్వాడాయన. ఆ నవ్వును గమనిస్తే 'ఒరే పిచ్చోడా! ఈ మాత్రం నాకు తెలియదను కున్నావా?' అన్నట్లుంది.

"చూడు నాయనా! కవిత్వం వచ్చినా కక్కు వచ్చినా ఆగదంటారు పెద్దలు. అలాగే కల్యాణ ఘడియలు కూడా! ఏదో అంతా మన చేతుల్లో ఉంటుందను కొంటుంటాం. వెర్రి నాయనా వెర్రి. అంతా మన వెర్రి! శివుడి ఆజ్ఞలేందే చీమ అయినా కుట్టదు!!".

చీమ కుట్టడాన్ని కూడా శివుడికి ఆపాదించే ఆ మనిషితో వాదించి ప్రయోజనం లేదని వెళ్ళి పోయే వాడిని!

నమ్మిన వానికి నమ్మినంత! అంటారు పెద్దలు. మరి మాధవయ్య భగవంతుణ్ణి నమ్ముకున్నాడు. భారాన్నంతా ఆయన మీద వేశాడు. ఒకరి జోలి తనకుగానీ, తన జోలి ఇతరులకు గానీ అనవసరం అనుకొన్నాడు. కర్మ సిద్ధాంతాన్ని నమ్ము కొన్నాడు. మరి ఈ కర్మ ఏమిటి? నన్ను పరిపరి విధాల పరితపిస్తూ ఉంది.

ఆఫీసులో కూర్చున్నాను. పరిస్థితి అకార పుష్ప నైవేద్య సృష్టిగా తయారయింది. పని మీద మనసు పడితే ఒట్టు!

ఈ ప్రజాస్వామ్య యుగంలో నేనొక ప్రజా సేవకుణ్ణి. ప్రజల సొత్తుతో బ్రదుకుతున్నాను కాబట్టి ప్రజల కోసం పని చేయాలి. అయితే అదే చేయలేదు. అలా అని కాలం నా కోసం ఆగలేదు.

ఇంటికి వెళ్ళామన్న మాటేకానీ ఇంట్లో ఉండ బుద్ధికాలేదు. మనస్సంతా మాధవయ్య మీదే ఉంది. అలా వూరం మీద పడితే అతడు కంటపడక పోతాడా అన్న ఆశ నన్ను ముందుకు లాగింది. నేను ఇంటి నుండి బయట పడ్డాను.

ఉన్నట్లుండి ఒళ్ళు ఝలిపించి దా పట్టణానికి. అది గూడా అనుకోనంతగా ఝలిపించింది. రోడ్లు ఇరుకు అయినాయి. జనసంఖ్య ఎక్కువయింది. ఇరుకు రోడ్ల మీద ఒక్క అడుగు ముందుకు వేయాలంటే పెరుకులాటగా ఉంటుంది మరీ సాయం సమయాల్లో. ఒక కంట మాధవయ్య కోసం వెదుకుతూ మరోకంట పై బడుతున్న రద్దీని తప్పుకొంటూ ముందుకు సాగి పోతున్నాను.

అతడు కనిపించాడు!

కనుపిస్తూనే రెండు చేతులు పొదివి పట్టుకొన్నాడు.

"ఏమిటో కనిపించడమే కరువై పోయిందే!" అని విస్మరాలాడాడు.

అతడు నా సహపాఠి. మాధవయ్యగారి వూరే! ఈ వూళ్ళోనే సహో కార్యాలయంలో ఉద్యోగి. పేరు రాధాకృష్ణ.

అతని నడిగితే వివరాలు తెలియవచ్చు ననుకొన్నాను. అదే అడిగాను.

"ఒరే రాధా! మీ వూళ్ళో నేనొక్క గదిలో అద్దె కున్నాను కదరా?"

"అవును!"

"ఆ ఇంటి యజమాని మాధవయ్యగార్ని ఎరుగుదువు కదరా?"

"భలేవాడివే! ఆ మాటేనీతో అందామను కొంటుంటే నువ్వే అడిగావు. అసలు నువ్వు కంటికి కనుపిస్తే కదా?"

"ఏమయిందిరా?"

"ఏమవుతుందిరా? ఏం కావాలో అదే అయింది. అతగాడేమో కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకొన్నాడు. గోళ్ళు గిల్లు కొంటూ కూర్చున్నాడు. ఒకరా? ఇద్దరా? అరడజను మంది ఆడ పిల్లలు. ఎంత కాలమని ఎదురు చూస్తారు. ఏవయసు కా ముచ్చట. తీర్చవలసింది తలిదండ్రుల బాధ్యత. ఆ బాధ్యతల్ని గుర్తించకుండా తండ్రి తన ధోరణి తనదిగావుంటే ఏం చేస్తారు? పెద్దపిల్ల ఎవరితోనో వెళ్ళిపోయింది. రెండోపిల్ల ఉన్నట్లుండి ఎలా కన్ను మూసిందో ఎవరికి తోచనట్లు వాళ్ళు ఇంకనూ కథలుగా చెప్పుకొంటున్నారు. ఈ దెబ్బలకు తట్టుకోలేక ఆ గృహలక్ష్మి గుండె గుట్టుచప్పుడుగా ఆగి పోయింది. అప్పటికి మాధవయ్య గారికి జ్ఞానోదయం కలిగింది, చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకొన్నట్లుగా! ఇల్లా వాకిలీ, భూమీపుట్రా అంతా తెగ నమ్మితేకానీ ఈ పవిత్ర భారత దేశంలో తండ్రీ—ఆ తండ్రి అల్లుళ్ళను కొని తెచ్చుకోలేక పోయాడు. ఇంకేముంది? నిలువ నీడలేదు. చేత కాసు లేదు. అన్నీ అమరిన వాళ్ళనే వృద్ధాప్యంలో చూడడం అంతంత మాత్రం. మాధవయ్య నెవరు చూస్తారు? వీధుల పాలయ్యాడు. పాపం! మొన్నొకనాడు హోటలు ముందు నిలబడి ఉంటే నేనే చూడలేక తీసుకొని వెళ్ళిపోయామురా!"

రాధాకృష్ణ కథ ముగించాడు!

ప్రయత్న పూర్వకంగా కన్నీళ్ళు ఆపు కొన్నాను.

అయితే మాధవయ్య మాటలు—నారు పోసిన వాడు నీరు పోయడా! అన్న మాట మాత్రం మనసులో మెదలతూ ఉంది.

నారు పోసిన వాడు నీరు పోయడా? పోస్తాడు!

ఎప్పుడు?

తన కర్తవ్యాన్ని నిర్వహించి నప్పుడు! లేకుంటే ఒకడి ముందు 'దేహి' అని చేయిచాపిస్తాడు.

ఏది తగునో? ఏది తగదో? నిర్ణయించు కోవలసింది మానవుడి కర్తవ్యం.

ఆ కర్తవ్యాన్నే విస్మరించాడు మాధవయ్య. అందుకే ఆయన కోసం నేను వెదుకుతున్నాను. ఆయనేమో కర్మ సిద్ధాంతం వెంట పడ్డాడు. ✱